

# భయపడవద్దు

**మనం ఎల్లప్పుడూ పోరాడవలసిన ప్రబల శత్రువు భయమే!** బాల్యం మొదలుకొని మరణపర్యంతం వెంటాడే శత్రువే భయం. అది మన ఆత్మవిశ్వాసాన్ని హరించుకుపోయేలా చేస్తుంది. మన కష్టాలను విస్తృతపరుస్తుంది. మనలను భయభ్రాంతుల్ని చేస్తుంది. భయం మన ఒంటరితనంలో నిస్సహాయతా భావాన్ని కల్పించి, బాధాకరమైన భావాలను మనలో తవ్విపోస్తుంది. భయం అనేది భయంకరమైన శత్రువు. భయంతో మనం ఒంటరిగా పోరాడలేం.

ప్రథమంగా దేవుని లేఖనంలో ఆది దంపతులైన ఆదాము, హవ్వలను ఆవేశించిన భయం గురించి వ్రాయ బడింది. తమ పరిశుద్ధతా సుగతిని కోల్పోయి, అవిధేయత ద్వారా ఆనందాన్ని పోగొట్టుకున్నప్పుడే భయం వారిపై ఆధిపత్యం చేసింది. పాపం చేయగానే భయమంటే ఏమిటో వారి అనుభవంలోనికి వచ్చింది. వారు శిక్షకు భయపడ్డారు. మనస్సాక్షి వేదనకు గురి అయ్యింది. ఘోర పరిణామాల భీతి వారిని నలిమివేయసాగింది. పాపం ద్వారా భయం లోకం లోనికి ప్రవేశించింది. పరిశుద్ధుడైన దేవుని సన్నిధి నుండి వైదొలగినప్పుడు మానవునిలో భయం ప్రారంభమైంది. అప్పటినుంచీ మనుష్యుడు భయపడుతూనే ఉన్నాడు.

మనుషులందరూ పాపులే! అందువల్ల అందరికీ భయం ఉండడం సహజమే. మనసా వాచా కర్మణా మానవులు అనేకమైన పాపాలు చేస్తూ ఉంటారు. మనమంతా పాపంలోనే పుట్టాం. స్వభావ రీత్యా మన హృదయాలు దుష్టమైనవి, పాపపంకిలమైనవి. వాస్తవంగా మనమంతా ఆధ్యాత్మికంగా మృతులమే. ఏమీ భేదం లేదు. మనుష్యులంతా పాపులే. పరిశుద్ధుడు, నీతిమంతుడైన దేవుని తీర్పు క్రిందికి ప్రతి ఒక్కడూ వస్తున్నాడు. పాపంవల్ల వచ్చే జీతం మరణమే! దేవుడు విధించే నిత్య శిక్ష అదే. క్షమించబడని పాపం నిత్యనరకానికి నడిపిస్తుంది.

ఆత్మ విషయంలో, వేరే అనేక సందర్భాల్లో సమగ్ర ప్రేమ భయాన్ని పారద్రోలుతుందని గ్రహించగలం. మనుష్యుల పట్ల తనకున్న అపార కనికరం చేత దేవుడు యేసుక్రీస్తు అనే పేరుతో మనుష్య రూపంలో జన్మించాడు. మనుష్యులందరి పాపాలకు శిక్షగా తన ప్రాణం అర్పించాడు. క్రీస్తు ద్వారా మనుష్యునికి పాప క్షమాపణ దొరికింది. పాపపు నేర భయం తొలగింది. పాపపు శక్తి చిన్నాభిన్నమైపోయింది. మానవులకు జీవం, రక్షణ లభ్య మయ్యాయి. మానవుడు యేసుక్రీస్తు ద్వారా దేవుని నుండి క్షమాపణ పొందగలడు.

ఈ క్షమాపణ నిశ్చయత మానవునిలోని ప్రాతిపదికయైన భయాన్ని తొలగిస్తుంది. చేసిన తప్పులకు ప్రతిదండనా భయాన్ని తీసివేస్తుంది. మానవులకున్న మరణ భయాన్ని మటుమాయం చేస్తుంది. సంభవించబోయే శిక్ష వల్ల కలిగే

భయం లేకుండా చేస్తుంది. విశ్రాంతిలేని హృదయానికి శాంతి, సమాధానాలు క్రీస్తులో లభిస్తాయి. యేసుక్రీస్తు నందలి విశ్వాసం ద్వారా ఈ క్షమాపణ అందరికీ లభిస్తుంది. ఆయన సిలువపై చిందించిన రక్తం ప్రతి పాపం నుండి మానవుణ్ణి పవిత్రునిగా చేయడంవల్ల అట్టడుగున ఉన్న భయం అంతరిస్తుంది. క్షమాపణ పొందిన వ్యక్తికి నెమ్మది కలుగుతుంది.

యేసుక్రీస్తును నీ దేవునిగా అంగీకరించినప్పుడు నీ పాపాలు క్షమించబడి నువ్వు పవిత్రుడివిగా తీర్చ బడతావు. దేవుని యెదుట నీతిమంతుడుగా నిలబడతావు. దేవుడు అనుగ్రహించే నిత్యజీవానికి పాత్రుడివి అవుతావు.

**క్రైస్తవ సత్య గ్రంథశాల**
ప్యాడిసన్‌పేట, తెనాలి-522 201

**Christian Truth Book Room,** Paddisonpet, Tenali–522 201